క్లుప్తంగా

జాతీయ స్థాయిలో ప్రతిభ చూపండి



శాలువా కప్పి సత్కరిస్తున్న కలెక్టర్

వాజేడు: జాతీయ స్థాయిలో జరిగే చెస్ పోటీల్లో ప్రతిభ చూపాలని ములుగు జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. వాజేడు ఉన్నత పాఠశాలలో పీటీగా పని చేస్తున్న తెల్లం రాజ్యలక్ష్మిని బుధవార ఆయన శాలువా కప్పి అభినందించారు. ములుగు జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలతో పాటు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలను తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా క్రీడల అధికారి పీవీఆర్ చారి, వాలీబాల్ కోచ్ సంపత్, రాంబాబు ఉన్నారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న పెట్టెం రాజు

ములుగు: హార్ట్‌బీట్ ఫౌండేషన్ ఫర్ విజ్యువల్లీ ఇన్‌పేయిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో అంధుల సంక్షేమం కోసం సేకరించిన రూ.7,700 విరాళాన్ని సన్ రైజర్స్ కరస్పాండెంట్ పెట్టెం రాజు బుధవారం జిల్లాకేంద్రంలో సంఘం సభ్యుడు రాకేశ్‌శర్మకు అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. మానసిక వికలాంగులకు ప్రతి ఒక్కరూ తోచిన సాయం చేయాలని కోరారు. విద్యార్థి దశ నుంచి సేవా గుణాన్ని అలవర్చుకోవాలని పాఠశాల విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బల్గూరి జనార్దన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలు చేయించుకోవాలి



సన్మానిస్తున్న జెడ్పీటీసీ రమణ

వెంకటాపురం(కె): వయస్సుతో పనిలేకుండా ప్రతి మహిళ తన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జెడ్పీటీసీ పాయం రమణ, సర్పంచ్ యామిలి అన్నారు. బుధవారం మండలంలోని ఎదిర పంచాయతీలో నూతన పథకం ఆరోగ్య మహిళ అంతర్జాతీయ మహిళా దినోత్సం సందర్భంగా శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి అప్పయ్య, ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ పాల్గొన్నారు.

పరామర్శ



రిశాంత్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం చల్వాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి అల్లం రిశాంత్ (07) మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బొట్ల కార్తీక్ బుధవారం ఈ మేరకు రిశాంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి మృతికి కారణమైన ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ముఖేష్, కోగిల అజయ్, రాజు, సలీం, దుర్గ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

మొగుళ్లపల్లి: మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన బొల్లు భాస్కర్ కొన్నిరోజుల క్రితం మృతిచెందాడు. ఈనేపథ్యంలో భాస్కర్‌తో 1998–99 సంవత్సరంలో ఆకినపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న మిత్రులు వారి కుటుంబానికి రూ.40వేలు బుధవారం సాయం అందజేశారు.

నర్సరీల పరిశీలన

మహాముత్తారం: మండలంలోని స్థంబంపల్లి (పీకే) బోర్లగూడెం, రేగులగూడెం గ్రామంల్లోని నర్సరీలను బుధవారం మహాముత్తారం ఎంపీడీఓ రవీంద్రనాథ్ పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. బోర్లగూడెం, రేగులగూడెం గ్రామాల్లో నూతనంగా చేపడుతున్న క్రీడాప్రాంగణం పనులను ప్రారంభించారు. ఎంపీడీఓ వెంట ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.



రేగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



మొగుళ్లపల్లి: మహిళలను సన్మానించిన సర్పంచ్



మహదేవపూర్: ముస్లిం మహిళలకు బహుమతులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

టేకుమట్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ధనలక్ష్మీ మండల సమైఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ శ్రీనివాస్, గుర్రపు రాజేందర్, మంజుల, సీఏలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రేగొండలో..

రేగొండ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పున్నం లక్ష్మీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించి, ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, ఐకేపీ సీసీ ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, సింగరేణి జీఎం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సింగరేణి జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాసరావు మహిళలతో కేక్ కట్ చేయించారు. ఈసందర్భంగా మహిళ ఉద్యోగులను సత్కరించారు. ఈకార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ ఆధ్వర్యంలో..

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ప్రధాన కార్యదర్శి తిరుపతి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయురాళ్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్హర్: తాడిచర్ల సాయివాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ సంపత్‌రావు, ఆధ్వర్యంలో మల్లారం గ్రామ పంచాయతీల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయివాణి విద్యానికేతన్ పాఠశాలలో మహిళ ఉపాధ్యాయినులను సంపత్‌రావు సత్కరించి, కేక్ కట్ చేయించారు. మల్లారంలో మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాస్‌రావు సర్పంచ్ గోనె పద్మను, మహిళ సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని, దేశాభివృద్ధి జరగాలంటే మహిళా సాధికారత ఎంతో అవసరమని అన్నారు.



భూపాలపల్లి రూరల్: జీఎం కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జీఎం శ్రీనివాసరావు, తదితరులు



చిట్యాల: మహిళా కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

మహదేవపూర్: మండలంలో మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, సూరారం గ్రామ పంచాయతీతో పాటు వివిధ గ్రామపంచాయతీల్లో మహిళా ఉద్యోగులను సన్మానించారు. మహిళలు సమాజంలో పోషిస్తున్న పాత్రపై వివరించారు.

చిట్యాల: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లక్క ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ దావ వినోద, జెడ్పీటీసీ గొర్రె సాగర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లక్క కేక్ కట్ చేశారు. మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ముందుకు సాగినప్పుడే సమాజం మరింత ప్రగతిపథంలో కొనసాగుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్ల మల్లయ్య, జెడ్పీటీసీ సాగర్, ఎంపీపీ దావు వినోదవీరారెడ్డి మాట్లాడారు. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న సంఘటనలపై, హక్కులపై, వివిధ సమస్యలపై కుల మతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

కాటారం: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో, ఆదర్శ హై స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ఎలుబాక సుజాత ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు ప్రారంభించారు. ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయినులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో అయిత శకుంతల, మమత, భాగ్యలక్ష్మి, సమత, ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత పాల్గొన్నారు.

పలిమెల: మండల కేంద్రంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ జవ్వాజి పుష్పలత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలు సర్పంచ్ పుష్పలతను శాలువాతో సన్మానించారు.

అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు

మొగుళ్లపల్లి: నేటి కంప్యూటర్ యుగంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని మొగుళ్లపల్లి సర్పంచ్ మోటె ధర్మారావు అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో మహిళ వార్డుసభ్యులను, గ్రామ పంచాయతీ సిబ్బందిని, అంగన్‌వాడీ టీచర్లను, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను, మహిళ సంఘాల వాళ్లను శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక స్త్రీ తన ఇంటితో పాటు దేశాన్ని, సమాజాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళా నేడు అంతరిక్షంలోకి అడుగుపెట్టి తమ గొప్ప తనాన్ని ప్రపంచానికి తెలియజేసిందన్నారు. రాజకీయంగా స్త్రీలు రాష్ట్రాన్ని శాసించే స్థాయికి ఎదిగారన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కాటారం: కాటారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



మల్హర్: సాయివాణి విద్యానికేతన్ పాఠశాలలో..



కాటారం: ఆదర్శ హై స్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



పలిమెల: సర్పంచ్ పుష్పలతను సన్మానిస్తున్న మహిళలు

క్రమశిక్షణతో ఉన్నత స్థానం



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మల్హర్: విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించి, భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉంటారని మండలంలోని తాడిచర్ల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్, నోడల్ అధికారి డి.దేవారాజం అన్నారు. కాలేజీ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కాలేజీలో విద్యార్థుల క్రమశిక్షణ, ప్రతిభకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నార. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చెట్టును ఢీ కొట్టిన బొగ్గు టిప్పర్



ధ్వంసమైన టిప్పర్

కాటారం: కాటారం మండలం గంగారం క్రాస్ సమీపంలో బుధవారం బొగ్గు టిప్పర్ అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్టును డీ కొట్టింది. తాడిచెర్ల నుండి కాటారం వైపుగా బొగ్గు లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్త కారణంగా అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. డ్రైవర్ స్వల్పగాయాలపాలయ్యాడు. సమీపంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఎమ్మెల్యేను కలిసిన హరీశ్‌రెడ్డి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హరీశ్‌రెడ్డి

భూపాలపల్లి అర్బన్: భారత జాగృతి జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన మాడ హరీశ్‌రెడ్డి బుధవారం స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పరామర్శ

మహాముత్తారం: మహాముత్తారం మండలంలో ఓ దినపత్రికలో పనిచేస్తున్న మాదారం గ్రామానికి చెందిన సూర్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సూర్యనారాయణను బుధవారం బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు చల్ల నారాయణరెడ్డి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు.

వర్గీకరణను విస్మరించిన బీజేపీ

కాటారం: ఎస్సీ వర్గీకరణను విస్మరించిన బీజేపీని రాజకీయంగా బొందపెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బట్టు విజయ్‌కుమార్ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మోసాన్ని నిరసిస్తూ మాదిగల సంగ్రామ పాదయాత్ర బుదవారం కాటారం చేరుకొంది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేస్తూ మార్చి 6న అంబట్‌పల్లిలో సంగ్రామ యాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు 28 ఏళ్లుగా మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉండి చట్టబద్దత కల్పించడం లేదని పేర్కొన్నారు. వర్గీకరణ చట్టబద్దత కోసం ఏప్రిల్ 4న హైదరాబాద్‌ను వేలాది మందితో దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. మాదిగ బిడ్డలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు మారుపాక లచ్చయ్య, గాజుల భిక్షపతి, చంద్రగిరి అశోక్, మంథెన రాకేశ్, మంథెన చిరంజీవి, శ్రీనివాస్, అకాశ్, నరేశ్, రఘు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న నాయకులు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

పలిమెల : ప్రభుత్వ వ్యతిరేక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని పలిమెల ఎస్సై అరుణ్ అన్నారు. బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా మండల కేంద్రంలోని గొత్తికోయ గూడెంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెంలోని గొత్తికోయలతో మాట్లాడుతూ ఎవ్వరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలను పాఠశాలకు పంపి మంచి చదువును అందించాలన్నారు. అనంతరం కానిస్టేబల్ అశోక్ వారి తండ్రి పుట్టినరోజు సందర్భంగా గూడెంలోని 16 మంది గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఎస్సై అరుణ్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



గొత్తికోయలకు నిత్యావసరాలను అందజేస్తున్న ఎస్సై అరుణ్

క్యాలెండర్ ఆవిష్కరణ

భూపాలపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో భూపాలపల్లి అర్బన్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీ పెండల సంపత్ పటేల్ హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గండు రమేష్, జిల్లా యూత్ కమిటీ అధ్యక్షుడు రాజేందర్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గణపురం మండల అధ్యక్షుడు పుప్పాల దీపక్, భూపాలపల్లి పట్టణ యూత్ అధ్యక్షుడు గాజే వేణుగోపాల్, పట్టణ యువత జనరల్ సెక్రెటరీ నిమ్మతి సంతోష్, జిల్లా యువత జనరల్ సెక్రెటరీ మాచర్ల సంతోష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జర్నలిస్టుల విన్నపం



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న జర్నలిస్టులు

ఏటూరునాగారం: సమాజంలో విలేకరుల పాత్ర చాలా ముఖ్యమైనదని ప్రభుత్వానికి, అధికారులకు ప్రజల సమస్యలను తెలియజేయడంలో విలేకరులు వారధిగా ముఖ్య పాత్ర పోషిస్తారని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఆరోగ్యమహిళా పథకాన్ని ప్రారంభించడానికి వచ్చిన కలెక్టర్ కృష్ణ ఆదిత్యను ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు అఫ్జల్ పాషా, ప్రధాన కార్యదర్శి అలువాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా అఫ్జల్ పాషా కలెక్టర్‌తో మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. గతంలో ప్రెస్ క్లబ్ భవనం కోసం దరాఖాస్తు చేసుకున్నామని కలెక్టర్‌కు గుర్తు చేశారు. అంతే కాకుండా ప్రెస్ క్లబ్ స్థలం, భవన నిర్మాణం కోసం కావాల్సిన చర్యలు చేపడుతామన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ కృష్ణ అదిత్య నూతన ప్రెస్‌క్లబ్ కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా సడాలమ్మ, లక్ష్మీదేవర ఎదుర్కోలు

మంగపేట: మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని కన్నాయిగూడెంలో సడాలమ్మ, లక్ష్మీదేవర అమ్మవారి ఎదుర్కోలు మహోత్సవ కార్యక్రమం నాగులమ్మ ఆలయ ప్రధాన పూజారి, ఉపాసకుడు(ఆలయ ట్రస్టీ) బాడిష రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనర్సాపురంలోని నాగులమ్మ ఆలయంలో ప్రారంభమైన జాతర రెండో రోజు సడాలమ్మ పూజారి కొమరం నితిన్, ఆలయ పూజారులు, వడ్డెలు ఆలయ సమీపంలోని ఎర్రట్టలగుట్ట వద్ద ఆదివాసీ గిరిజన సంప్రదాయం ప్రకారం.. ప్రత్యేక పూజలు నిర్వహించి సడాలమ్మ అమ్మవారిని డోలి వాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకొచ్చారు. లక్ష్మీదేవర అమ్మవారిని పూజారులు బొనతల సాగర్, నాయుడు పోచాలు బృదం, నాగులమ్మ ప్రతిరూపాలు అయిన జెండా కర్రలతో పూజారులు, వడ్డెలు గిరిజన సంప్రదాయ బద్ధంగా సంబరాలు నిర్వహించి ఎదుర్కోలు పలికారు. సడాలమ్మ అమ్మవారు ఆలయానికి వచ్చేక్రమంలో సమీపంలోని వాగొడ్డుగూడెం, కన్నాయిగూడెం, లక్ష్మీనర్సాపురం గ్రామాల నుంచి ఆదివాసీ గిరిజన మహిళలు, యువతులు నీళ్లార బోసి సల్లంగ చూడమని వేడుకున్నారు. అ నంతరం పూజారులు, వడ్డెలు సడాలమ్మ అమ్మవారిని గద్దెపై ప్రతిష్ఠించి పూజలు చేశారు.

నేడు నిండు జాతర

ఈనెల 7 నుంచి ప్రారంభమై 11 వరకు ఐదు రోజుల పాటు జరిగే నాగులమ్మ జాతరలో మూడో రోజు నిండు జాతర. మూడోరోజు కార్యక్రమంలో భాగంగా గురువారం గండొర్రెగుట్ట వద్ద శ్రీ నాగులమ్మ పూజారి బాడిష నాగరమేష్, వడ్డెలు, పూజారులు గిరిజన సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించి అమ్మవారిని ఆలయానికి తీసుకొస్తారు. రాజుపేట బస్టాండ్ సెంటర్ వద్ద, రమణక్కపేట సమీపంలోని ఎర్రమ్మతోగు ప్రాంతంలోని పాలమాకుల ఒర్రె వద్ద వడ్డె కుర్సం పుల్లయ్య వనదేవత(కంకవణం)కు పూజలు నిర్వహించి గుడికి తీసుకొచ్చే క్రమంలో నాగులమ్మ, వనదేవత(కంకవనం)కు ఎదుర్కోలు నిర్వహిస్తారు. నిండు జాతర సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో నాగులమ్మ ఉపాసకుడు రామకష్ణ స్వామీజీ ఒంటి గంట నుంచి నడుస్తారు.



ఎర్రట్టల గుట్ట నుంచి సడాలమ్మ అమ్మవారిని గద్దెకు తీసుకువస్తున్న పూజారులు, వడ్డెలు

బాల్యవివాహాలు చేయొద్దు

వాజేడు: బాల్య వివాహాలు చేయడం నేరమని వాజేడు ఎస్సై రేక అశోక్ అన్నారు. మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ తన సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆయన మాట్లాడుతూ మేజర్లు కాకుండా ఏ ఒక్కరికీ వివాహాలు చేసినా చట్ట ప్రకారం నేరం అని తెలిపారు. గ్రామంలో పేకాట, కోడి పందేలు లాంటి జూదాలు ఆడితే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామంలోకి కొత్తవారు వస్తే ఆశ్రయం కల్పించొద్దన్నారు. గొడవలు, కొట్లాటలకు దూరంగా ఉండాలని సూచించారు.



గ్రామస్తులతో ఎస్సై అశోక్